# యాగెంకో

మా ఊరికి సర్కాసు వచ్చింది.

గాంధీ మైదానంలో డేరాలుపడ్డ మూడురోజుల తర్వాత ఓనాడు ఆఫీసునుంచి అటువేపు నడిచాను. జంతువుల అరుపులూ, అంతకుమించి మనుషుల కేకలూ విపరీతంగా విన్పిస్తున్నాయి. అప్పటికే కుర్రాళ్ళంతా చేరి కోతులకూ, మిగతా జంతువులకూ కాలక్షేపం ఇస్తున్నారు.

పార్కులోకి వచ్చి బెంచీమీద కూచున్నాను. చక్కటి వీణపాట విన్పిస్తోంది రేడియోలోంచి. చల్లటిగాలి వీస్తోంది. రోజంతా పనిచేసి రావడం వల్ల వొళ్ళంతా చచ్చిపోయిఉందేమో, ఈ చల్లటిగాలి తగలగానే 'జిల్'మంది. ప్రాణం లేచివచ్చింది. అలానే కూచున్నాను.

మరికాస్సేపటికి "మీదీవూరేనా?" అని ఎవరో పలకరించడం వినిపించింది. అటువేపు తిరిగాను, ఎవరో చైనా దేశస్థుడు, పొట్టిగా, ఎర్రగా, బలంగా ఉన్నాడు. పెదవులు వంపు తిరిగి ఉన్నాయి. కనురెప్పల్లో పట్టుదలా, ముక్కు వంపు అహంకారం సూచిస్తున్నాయి. ఆ క్షణంలో ఎందుకో ఆ వ్యక్తి నన్నాకర్షించాడు.

వచ్చీరాని ఇంగ్లీషులో అడిగాడు "మీదీవూరేనా?"

"అవును"

"ఈ వూరి వాతావరణం నాకెంతో నచ్చింది. ఇప్పటికి చాలా ఊర్లు చూశాను. కాని విశాఖపట్నంలాగ ఏదీ కనిపించలేదు"

నేనాశ్చర్యపోయేను. ఎంచాతనంటే ఇంతవరకూ విశాఖపట్నం వచ్చినవాడెవడూ దాన్ని తిట్టకుండా పోలేదు. జీవన ప్రమాణాలు హెచ్చనో, ఇక్కడ బ్రతకడం అసాధ్యమనో, మనుషుల్లో నిజాయితీ లేదనో – ఇలా అని పోతూండే వాళ్లు. కాని ఒక పరాయి దేశస్థుడు దాన్ని మెచ్చుకునే సరికి నాకు ఉత్సాహం కలిగింది.

"నిజమే – దీని అందం దేనికి వస్తుంది చెప్పండి. దూరాన డాల్ఫిన్స్ నోస్, బోటు షికార్లు, ఎప్పుడన్నా పోవాలనుకుంటే లోయతోట, విశాలంగా పరుచుకున్న బీచీ ఇసుకా, శాంతి ఆశ్రమం ప్రశాంతత, లాసన్సుబే – ఇవన్నీ ఎక్కడొస్తాయి?"

"నిజమే" అన్నాడతను.

"మీ పేరు?"

"యాగెంకో"

"ఎక్కడ పని చేస్తున్నారు??

సర్కసు డేరా వేపు చూపించాడు "అక్కడా" అన్నాడు.

నాకు ఉత్సాహం మరీ ఎక్కువయింది.

"ఏం చేస్తుంటారు?" అన్నా ముందుకు వంగి.

"పింగాణీ ప్లేట్లను చేతి కర్రతో కిందపడకుండా తిప్పటం – ఒకటి రెండు, మూడు – ఇలా పది బంతుల్తో ఒక్కసారి ఆడడం, నిప్పుల కొరివిల్ని ఎగరేసి అందుకోవడం – ఇలాంటివి."

అతని మీద నాకు గౌరవం హెచ్చయింది.

"ఇవాళ మీరు చేస్తారా అవన్నీ?"

తలూపాడు.

"అయితే తప్పకుండా వస్తాను సర్కస్‌కి"

"రాండి" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"ఎన్నాళ్ళబట్టి మీరు ఈ సర్కసులో పనిచేస్తున్నారు!"

"సంవత్సరమయింది సుమారు"

"అంతకు క్రితం"

"చైనాలో ఉండేవాణ్ని"

"అక్కణ్నుంచి వచ్చేశారేం?"

"తిండికోసం. స్వయంగా కష్టపడి పనిచేయందీ మా ఆడవాళ్ళు మమ్మల్ని గౌరవించరు" – ఇది చెప్పడంలో సిగ్గుపడలేదతను.

"ఇలాంటి చిన్నచిన్న పన్నులన్నీ చిన్నతనంలో ఆడుకునేటప్పుడు మా అమ్మావాళ్ళు నేర్పారు. ఇక్కడ అవి పెద్ద పెద్ద అద్భుతాలుగా చూస్తారు..."

"రోజూ ఇక్కడికి వస్తారా?" అన్నాడతను.

"రాను. ఇవాళే వచ్చా. ఏం?"

"ఒంటరిగా ఈ రోజులన్నీ గడపాలంటే నాకు చెడ్డచిరాకు. నాతో పనిచేసే వాళ్ళంతా ఎప్పుడూ నిద్రపోతూంటారు. నేను మాత్రం ఇలా స్నేహితులకోసం తిరుగులాడుతాను"

"మీరు రోజూ వచ్చేట్టయితే నేనూ వస్తాను" అన్నాను. అతనితో స్నేహం చేయడానికి మనస్సెందుకో ఉరకలు వేసింది.

"తప్పకుండా" అన్నాడతను.

ప్రతీరోజూ ఆ పార్క్ కి వచ్చి కూచునే వాణ్ని. అతడూ వచ్చి కూచునేవాడు.

ఓరోజు అడిగాడు: "మీ కెందరు పిల్లలు!" అని.

"ఇద్దరు"

"వాళ్లకివి ఇవ్వండి." అని రెండు బిస్కట్ పాకెట్లు ఇచ్చాడు.

హఠాత్తుగా ఎందుకా ప్రశ్న అడిగాడో, ఎందుకా పాకెట్లు ఇస్తున్నాడో అర్థం కాలేదు నాకు. అదే అడిగాను.

"నాకూ ఓ అబ్బాయి వున్నాడు. ఇప్పుడు నా భార్య గర్భవతి" అన్నాడు.

"వాళ్ళిద్దరూ చైనాలోనే ఉన్నారా?"

తలూపాడు. "ఇవాళ అబ్బాయి పుట్టినరోజు. అక్కడుంటే వాడికి బిస్కట్లు కొనియిచ్చేవాణ్ని."

పిల్లల్ని చూడడానికి అతని మనస్సు ఎంత తహతహలాడుతున్నదో అతను చెప్పిన ప్రతీమాటా తెలియజేసింది.

"మీరు చైనాకి ఎప్పుడు వెళతారు!"

"ఏమో తెలీదు. బహుశా మరో సంవత్సరం ఉండి వెళ్ళిపోతాను, ఈలోగా కొంతడబ్బు సంపాయించవచ్చు."

"ఇంత దూరం వచ్చేయడం బాధ అనిపించడం లేదా మీకు?"

నవ్వేడతను. "పెళ్ళాం పిల్లల్ని వదులుకొని దూరంగా పోవాలని ఎవరన్నా అనుకుంటారా చెప్పండి?" అన్నాడు.

ఇది జరిగిన పదిరోజుల తర్వాత అనుకుంటాను. ఒకనాడు సాయంకాలం సర్కసు చూడడానికి పోయేను.

అన్నిసంగతులూ ఎలా ఉన్నా ఎర్రచారల బనీను వేసుకుని 'యాగెంకో' ప్లేట్లు ఎగరేయడం అద్భుతంగా కన్పించింది నాకు. అలానే చూస్తూ కూచొన్నాను. బంతులు విసరడం ప్రారంభించాడు మరికాస్సేపటికి. తర్వాత కత్తులు. అప్పటికే బాగా అలసిపోయి ఉన్నట్టు అతని ముఖమే చెప్తోంది. ఉండుండి చెమట తుడుచుకొంటున్నాడు. ఏదో ఆవేశంతో ఈ పనులన్నీ చేసుకుపోతున్నాడు. ఇంతలో పొగలు కక్కుతూన్న మూడు కొరివిల్ని అతని చేతిలో ఉంచారు. చేతులు కాలకుండా వాటిని ఎగరేసి అందుకొంటూండడం ఓ అంశం.

పదిగంటలు పనిచేసిన గుమాస్తా ముఖంలో ఇంకా పని తరగలేదన్న బాధ ఎలా ఉంటుందో, అతని ముఖంలో అదే కన్పించింది. విధిలేక అందుకొన్నాడు వాటిని. ఎగరేస్తున్నాడు. గాలిలో తిరుగుతున్నాయి. ఏది మీదకు పోయిందో, ఏది చేతికందిందో తెలీకుండా తిరుగుతున్నాయి. అగ్నిజ్వాలలు, జ్వాలలుగా కన్పించింది క్షణకాలం. జ్వాలాతోరణం మయింది కాస్సేపటికి. ఇప్పుడిక సుడులు తిరుగతున్నట్టుంది. అతని చేతులు ఏదో యంత్రంలా కదిలిపోతున్నాయి.

హఠాత్తుగా అతను నేలనపడిపోయేడు. ఎగురుతున్న కొరివిలు రెండు వంటిమీద పడిపోయేయి. వాటిని తీసుకొనడానికి కూడా స్పృహ లేనట్టు పడిపోయేడు యాగెంకో. క్షణంలో ఇద్దరుముగ్గురు పరుగెత్తుకు వచ్చారు. వాటిని తీసేశారు. వెంటనే అతన్ని మోసుకుపోయారు.

ఇదంతా రెప్పపాటులో జరిగిపోయినట్టనిపించింది.

నా మనస్సంతా వికలమయింది – యాగెంకో ఏమయాడోనన్న ఆతృత నన్ను పీకుతోంది. కాని ఆ రద్దీలో నేను దగ్గరికి పోయే అవకాశం తక్కువ. అప్పటికే మళ్ళీ మిగతా అంశాలు ప్రారంభమయ్యాయి. మళ్ళీ అంతా స్థిమిత పడిపోయేరు. నేను మాత్రం మెల్లగా లేచి బయటికి వచ్చేశాను.

నల్లటి ఆకాశం మీద మిణుగురుల్లా మెరుస్తున్నాయి అక్కడక్కడ నక్షత్రాలు. డేరా బయట అంతా నిశ్శబ్దంగా ఉంది. పులి అరుపు దూరంగా విన్పించింది. రెండుకుక్కలు అరుస్తున్నాయి. ఓ కుర్రాడు డేరా కన్నంలోంచి సర్కసు చూస్తున్నవాడల్లా నన్నుచూచి భయపడ్డాడు. నేను మెల్లిగా నడుచుకొంటూ పోయాను.

మర్నాడు యాగెంకొని హస్పిటల్లో చేర్చారని విని వెళ్ళాను. నన్ను చూడగానే చిరునవ్వుతో పలకరించాడు. అతన్నిచూస్తేనే దిమ్మరపోయి, వణుకుతో ఆగిపోయేను. రొమ్ము కుడిభాగమంతా అగ్ని జ్వాలల్లో ఉడికిపోయింది. మెడకింది చర్మం పూర్తిగా పోయింది. అక్కడక్కడ రక్తం చిమ్ముతోంది. అతని స్థితి చూస్తే కళ్ళనీళ్ళొచ్చాయి.

"అబ్బాయికి ఏదో విషజ్వరం వచ్చినట్టు నిన్న కల వచ్చింది. మనసంతా పూర్తిగా చెడిపోయింది, సరిగ్గా సమయానికి చెయ్యి ఆడలేదు. ప్రమాదం జరిగిపోయింది." అన్నాడు యాగెంకో.

గొంతు పెగల్లేదు నాకు. "ఇప్పుడేం చేస్తారు?" అన్నాను.

"గాయాలు మానేవరకూ ఇక్కడే ఉండాలి"

సుమారు రెండు నెలలయినా పట్టవచ్చునని తోచింది నాకు. ఎందుకంటే బాగా కాలిపోయింది కుడిభాగమంతా.

"మరో విషయం – వారం రోజుల్లో సర్కసు ఇక్కణ్నుంచి ఎత్తేస్తారు"

నేను నివ్వెరపోయాను.

"మరి మీరు?"

"నాకు కొంత డబ్బిస్తారు. ఇది బాగయేవరకూ ఇక్కడే ఉండాలి"

"తర్వాత?"

"తర్వాత ఏమో! - సరిగ్గా పనులు చేయగల్గితే వాళ్ళని వెదుక్కొంటూ పోవాలి, లేకపోతే నాదారి నాది"

డబ్బు సంపాయించుకొని, ఇటికి వెళ్ళి పోతానని అతను చెప్పిన మాటలు గుర్తు కొచ్చాయి - కాస్సేపు కూచొని ఇంటికి వచ్చేశాను.

అప్పుడప్పుడు అలా వెళ్లే వచ్చే వాణ్ణి, ఓరోజు నేను వెళ్ళగానే నాతో అన్నాడు "ఇవాళే ఇంటి నుంచి ఉత్తరం వచ్చింది. కొడుకు పుట్టాడు" అంత బాధలోనూ కాస్త సుఖం కనిపించే సర్కి ఎంతో పొంగిపోయేడు యాగెంకో. "మరో పదిహేను రోజుల్లో గాయాలన్నీ పూర్తిగా మానిపోతాయని చెప్పాడు డాక్టరు. తగ్గగానే వెంటనే ఇంటికి వెళ్ళిపోతాను" అన్నాడు.

నేను వచ్చేశాను, తర్వాత అనుకోకుండా ఇర్వై రోజులు పై ఊరు వెళ్ళవలసి వచ్చింది, వెళ్ళానన్న మాటేగాని అప్పుడప్పుడు యాగెంకో జ్ఞాపకం వస్తూనే ఉన్నాడు.

ఇంటికి వస్తూనే అతన్ని చూసిరావడానికి బయల్దేరాను. దారిలో అతనికివ్వడానికి ద్రాక్షపళ్ళు కొన్నాను.

వెళ్ళేసరికి అతని మంచం ఖాళీగా ఉంది. బహుశా గాయాలు మానాయేమో?

డాక్టరు గదిలోకి వెళుతున్నాడు. ఆయన ఎవరితోనో మాట్లాడుతున్నాడు. పదినిమిషాల తర్వాత నావేపు తిరిగారు.

"ఇర్వై రోజుల కిందట యాగెంకో అనే చైనా దేశస్థుడుండేనాడిక్కడ. ఆయన ఎక్కడికి పోయాడు?"

"పాపం, చచ్చిపోయాడు. శారీరకమైన బాధకంటే మానసికంగా అలసట ఎక్కువయిందనికి. చనిపోయి పదిరోజులయింది" అన్నాడు. నేను మెల్లగా లేచి వచ్చేశాను. ద్రాక్షపళ్ళు చేతిలోనే ఉన్నాయి.

----